బలగం BALAGAM TV
BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com
హైదరాబాద్ ఆదివారం 26 అక్టోబర్ 2025 | www.balagamtv.com | పేజీలు 4

## రేబిస్‌తో చిన్నారి మృతి

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో



ఫైల్‌ఫొటో

నిజామాబాద్ జిల్లా బాల్కొండ మండల కేంద్రంలో రేబిస్ వ్యాధితో చిన్నారి మృతిచెందింది. మండల కేంద్రానికి చెందిన గడ్డం మహేశ్ కూతురు లక్షణ(11) అక్టోబర్ 1న ఇంటి ఆవరణలో ఆడుకుంటుండగా వీధికుక్క దాడి చేసింది. దాంతో బాలికకు కుటుంబ సభ్యులు టీకాలు వేయించారు. కానీ తలపై చిన్న గాయమైంది. దానిని గమినించలేదు. ఈ క్రమంలో రెండ్రోజుల కిందట చిన్నారి తీవ్ర అస్వస్థతకు గురికావడంతో ఆర్మూర్ పట్టణంలోని ప్రయివేటు ఆస్పత్రికి, అక్కడి నుంచి నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరిశీలించి రేబిస్ లక్షణాలున్నాయని తెలిపారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం బాలికను హైదరాబాద్‌లోని నిలోఫర్ ఆస్పత్రికి శుక్రవారం తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి లక్షణ శనివారం ఉదయం మృతిచెందింది. వీధికుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయని, అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# తెలంగాణలోనూ సర్




- సిద్ధంగా ఉండండి
- జిల్లా కలెక్టర్లకు సీఈవో ఆదేశం
- తప్పుల్లేని, సమగ్ర ఓటర్ల జాబితా రూపొందించాలి

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

ప్రత్యేక విస్తృత ఓటరు జాబితా (ఎస్ఐఆర్) సవరణలో బాగంగా చేపట్టాల్సిన అన్ని కార్యక్రమాలను నిర్ణీత గడువులో పూర్తిచేయాలని రాష్ట్ర ఎన్నికల ముఖ్య అధికారి (సీఈవో) సి.సుదర్శన్‌రెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ప్రత్యేక విస్తృత ఓటరు జాబితా సవరణపై శనివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులు నియోజకవర్గ ఎన్నికల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టేబుల్‌టాప్ వ్యాయామం వంటి పెండింగ్ పనులను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. ప్రతి నియోజకవర్గం, పోలింగ్ స్టేషన్ వారీగా పురోగతిని సమీక్షిస్తూ, ఖచ్చితమైన లోపరహిత ఓటర్ల జాబితా తయారీపై దృష్టి పెట్టాలని ఆదేశించారు. రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పారదర్శకంగా, తప్పులేని, సమగ్ర ఓటర్ల జాబితాను సిద్ధం చేయడం ఎన్నికల కమిషన్ యొక్క ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఇటీవల ఢిల్లీలో ప్రధాన ఎన్నికల కమిషనర్ ఆధ్వర్యంలో జరిగిన రెండు రోజుల జాతీయ సమావేశంలో ఎన్నికల జాబితా నిర్వహణలో సాంకేతికత వినియోగం, పారదర్శకత పెంపు, ఓటర్ల సేవల మెరుగుదల ఉత్తమ పద్ధతుల అమలు వంటి అంశాలపై చర్చించినట్టు చెప్పారు. కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు రాష్ట్రంలో ఎస్ఐఆర్‌ను నిర్వహించనున్నట్టు చెప్పారు. నవంబర్ ఒకటిన నిర్వహించనున్న సమీక్షా సమావేశం వరకు సర్‌కు సంబంధించి అన్ని పెండింగ్ పనులు పూర్తి చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. సమీక్షా సమావేశంలో రాష్ట్ర అదనపు ముఖ్య ఎన్నికల అధికారి లోకేష్ కుమార్, ఉప ముఖ్య ఎన్నికల అధికారి హ సింగ్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



## హైదరాబాద్‌లో కుండపోత వర్షం

- ఇబ్బందులు పడ్డ వాహనదారులు

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

భాగ్యనగర వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. శనివారం ఉదయం ఎండగా కనిపించిన ఆకాశం మధ్యాహ్నానికల్లా మేఘావృతమై కుండపోత వర్షాలకు తలొంచింది. ఎలాంటి సూచన లేకుండానే వర్షం దంచికొట్టడంతో నగరవాసులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మాదాపూర్, హైటెక్ సిటీ, గచ్చిబౌలి, కొండాపూర్, రాయదుర్గం, హఫీజ్‌పేట్ ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. మియాపూర్, చందానగర్, బీహెచ్ఈఎల్, మదినగూడ, నిజాంపేట్, బాచుపల్లి, దుండిగల్, మల్లంపేట ప్రాంతాలు కూడా వర్షం బీభత్సాన్ని చవిచూశాయి. ఈదురుగాలుల తీవ్రతకు పలు ప్రాంతాల్లో చెట్లు విరిగిపడ్డాయి. రోడ్లపై ఎక్కడికక్కడ వర్షపు నీరు నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఎస్ఆర్ నగర్, అమీర్‌పేట్ మార్గాల్లో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. లోతట్టు ప్రాంతాలు పూర్తిగా జలమయమయ్యాయి.

కూకట్‌పల్లి, మూసాపేట్, సనత్ నగర్, ఎర్రగడ్డ, ఎస్ఆర్ నగర్ పరిసరాల్లో ఎడతెరపి లేకుండా వర్షం కురిసింది. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, ఖైరతాబాద్, పంజాగుట్ట, సోమాజిగూడ, నాంపల్లి, మెహదీపట్నం, టోలిచౌకీ ప్రాంతాలు కూడా వర్షంతో తడిసి ముద్దయ్యాయి. వర్షంతో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా అంతరాయం ఏర్పడింది. రోడ్లపై నీరు నిలవడంతో వాహనాలు నత్తనడకన కదిలాయి. శుక్రవారం కూడా ఎలాంటి ఉరుములు, మెరుపులు లేకుండానే నగరంలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురిసిన సంగతి తెలిసిందే.

# చొరబాటుదారుల్ని బిహార్ నుంచి పంపిస్తాం



- రాహుల్ యాత్ర చొరబాటుదారుల రక్షణకే
- కేంద్ర హోంమంత్రి అమిత్ షా

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

బిహార్‌లో ఉన్న ప్రతి చొరబాటుదారుడిని గుర్తించి, వారి స్వదేశాలకు తిరిగి పంపిస్తామని కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. చొరబాటుదారులను ఓటరు జాబితా నుంచి తొలగించేందుకు ప్రయత్నిస్తుంటే, వారిని రక్షించేందుకే రాహుల్ గాంధీ యాత్ర చేపట్టారని ఆయన విమర్శించారు. శనివారం ఖగారియాలో ఎన్నికల ప్రచార సభలో మాట్లాడుతూ అమిత్ షా ఆర్‌జేడీ, కాంగ్రెస్‌పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రధాని నరేంద్ర మోదీ, సీఎం నీతీశ్ కుమార్ బిహార్ అభివృద్ధికోసం కృషి చేస్తుంటే, లాలూ ప్రసాద్ యాదవ్ మాత్రం తన కుటుంబ ప్రయోజనాల కోసం అధికారంలోకి రావాలని చూస్తున్నారని మండిపడ్డారు.

"లాలూ, రబ్రీ ప్రభుత్వాలు వస్తే బిహార్‌లో మళ్లీ జంగిల్ రాజ్ పాలన వస్తుంది. ఎన్‌డీఏ అధికారంలోకి వస్తేనే అభివృద్ధి సాధ్యమవుతుంది. మోదీ హయాంలో దేశ ఆర్థిక వ్యవస్థ 11వ స్థానంలోనుంచి 4వ స్థానానికి చేరింది. 2027 నాటికి భారత్ మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరిస్తుంది. యూపీఏ హయాంలో పాకిస్థాన్ తరచూ దాడులు చేసేది అప్పుడు సోనియా, మన్మోహన్, లాలూ మౌనంగా ఉండేవారు. ఇప్పుడు రాహుల్‌బాబు చొరబాటుదారుల రక్షణకే యాత్ర చేస్తున్నాడు," అని షా వ్యాఖ్యానించారు.

అసెంబ్లీ ఎన్నికల హోరాహోరీ ప్రచారంలో బిహార్ కదలికలు ఉధృతంగా సాగుతున్నాయి. అధికార, విపక్ష పార్టీలు గెలుపు కోసం పావులు కదుపుతున్నాయి. సభలు, ర్యాలీలు, జనసమావేశాలతో నాయకులు బిజీగా ఉన్నారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఈ సందర్భంగా విపక్షాలపై మరింత దూకుడుగా విమర్శలు గుప్పించారు. "ఇండియా కూటమి ప్రత్యేక సమగ్ర సవరణ (%వాక్ష్మీక్ష్మ%)ను వ్యతిరేకించి బిహార్ అభివృద్ధిని అడ్డుకుంటోంది" అని మండిపడ్డారు.

"2005 నుండి 2025 వరకు బిహార్‌లో నేరాలు గణనీయంగా తగ్గాయి. గత దశాబ్దంలో పెద్దఎత్తున హత్యాకాండలు జరగలేదు. ప్రధాని మోదీ పాలనలో దేశం సురక్షితంగా మారింది. అయోధ్యలో రామ్‌లల్లా ఆలయానికి ప్రాణప్రతిష్ఠ జరగడం చారిత్రాత్మక ఘట్టం," అని అమిత్ షా పేర్కొన్నారు.

"రాహుల్, మమతా, లాలూ రామాలయాన్ని వ్యతిరేకించినా, మోదీ హయాంలో నలంద విశ్వవిద్యాలయ పునర్నిర్మాణం పూర్తయింది," అని తెలిపారు. మహాగర్‌బంధన్ వాగ్దానం: ప్రతి కుటుంబానికి ఉద్యోగం ఇక మరోవైపు ఆర్‌జేడీ నేత తేజస్వీ యాదవ్ కూడా ఎన్నికల బరిలో దూసుకెళ్తున్నారు. ఖగారియాలోని గోగ్రీలో నిర్వహించిన ప్రచార సభలో మాట్లాడుతూ, "ప్రభుత్వం ఏర్పాటు కోసం కాకుండా, బిహార్ అభివృద్ధికోసమే పోటీ చేస్తున్నాం. మహాగర్‌బంధన్ అధికారంలోకి వస్తే ప్రతి కుటుంబానికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించే చట్టాన్ని 20 రోజుల్లో తీసుకొస్తాం. 20 నెలల్లో నియామకాలు పూర్తి చేస్తాం," తేజస్వీ మాట్లాడుతూ, "బిహార్‌ను నంబర్‌వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దడానికి పెట్టుబడులు ఆకర్షించడం, విద్య, వైద్యం రంగాల అభివృద్ధి మా లక్ష్యం" అని పేర్కొన్నారు.



## త్వరలో డీసీసీ అధ్యక్షుల ప్రకటన

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

తెలంగాణలో జిల్లా కాంగ్రెస్ కమిటీ(డీసీసీ) అధ్యక్షుల ఎంపిక ప్రక్రియ కసరత్తు తుది అంకానికి చేరింది. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య నేతలతో భేటీ అనంతరం సామాజిక న్యాయం, సమర్థులైన వారికి డీసీసీ బాధ్యతలు అప్పగించాలని అధిష్టానం నిర్ణయించింది. ఈ మేరకు శనివారం ఢిల్లీలోని ఇందిరా భవన్‌లో పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి (సంస్థాగత) కేసీ వేణుగోపాల్... సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్‌లతో వేర్వేరుగా సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా పార్టీ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌తో కలిసి దాదాపు రెండు గంటల పాటు డీసీసీ ఎంపిక, రాష్ట్రంలోని తాజా అంశాలపై కేసీ ప్రత్యేకంగా చర్చించారు. తొలుత సీఎం రేవంత్‌రెడ్డితో కేసీ వేణుగోపాల్ భేటీ అయ్యారు. అనంతరం డిప్యూటీ సీఎం భట్టి, పీసీసీ చీఫ్‌లతో వన్ టూ వన్ సమావేశాలు చేపట్టారు. కాగా.. ఈ సమావేశంలో రాష్ట్ర స్థాయిలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం, మార్పులపై విశ్లేషణాత్మక చర్చలు జరిపారు. ప్రధానంగా రాష్ట్రంలో మొత్తం 35 డీసీసీలకు, 4 కార్పొరేషన్లకు అధ్యక్షులను ఎంపిక చేయాల్సి ఉంది. ఇందుకోసం దాదాపు నెలకుపైగా చర్చ సాగుతోంది. ఈ ఎంపికపై ఏఐసీసీ నియమించిన 22 మంది పరిశీలకులు సైతం రాష్ట్రవ్యాప్తంగా పర్యటించి ఒక్కో డీసీసీ పదవికి ముగ్గురు పేర్లను సూచించారు. ఈ జాబితాను తాజాగా ఏఐసీసీ పరిశీలకులు అధిష్టానానికి సమర్పించారు. ఈ జాబితాతో పాటు సీఎం, డిప్యూటీ సీఎం, పీసీసీ చీఫ్ అభిప్రాయాలను కేసీ వేణుగోపాల్ అడిగి తెలుసుకున్నారు. తద్వారా ఎలాంటి వివాదాలూ లేని పలు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులను ఖరారు చేసినట్టు తెలిసింది. ప్రస్తుతం ఫైనల్ చేసిన పంజాబ్, రాజస్తాన్ రాష్ట్రాలతో పాటు తెలంగాణ జాబితాను ఒకటి, రెండు రోజుల్లో పార్టీ

మిగితా 2వ పేజీలో

# నగరంలో కాల్పుల కలకలం

- డీసీపీపై దుండగుడు కత్తితో దాడి
- దొంగలను వెంబడించిన డీసీపీ
- మూడు రౌండ్ల కాల్పులు
- నిందితుడి అరెస్టు

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో





నగరంలోని చాదర్‌ఘాట్‌లోని విక్టోరియా ప్లే గ్రౌండ్‌లో కాల్పుల ఘటన కలకలం రేపింది. నిజామాబాద్ జిల్లాలో చోటుచేసుకున్న కాల్పుల ఘటన నుంచి ఇంకా తేరుకోకముందే నగర నడిబొడ్డులో ఇద్దరు దొంగలు పోలీసులపై దాడిచేసిన సంఘట సంచలనం రేపింది.

హైదరాబాద్ సీపీ వీసీ సజ్జనార్ తెలిపిన వివరాల మేరకు... శనివారం సాయంత్రం పాతబస్తీ కామాటిపురా ప్రాంతానికి చెందిన పాత నేరస్థుడు రౌడీషీటర్, మొబైల్ స్నాచర్ మహ్మద్ ఒమర్ అన్సారీ, మరో నిందితుడు కలిసి సెల్‌ఫోన్ చోరీ చేసి పారిపోతున్నారు. అదే సమయంలో హైదరాబాద్ సౌత్ ఈస్ట్ డీసీపీ చైతన్య సీపీ కార్యాలయంలో జరిగిన మీటింగ్‌కు వెళ్లి తిరిగి తన కార్యాలయానికి వెళ్తున్న క్రమంలో పారిపోతున్న ఇద్దరు దొంగలను డీసీపీ గన్‌మెన్ గమనించారు. ఆ దొంగలను స్వయంగా డీసీపీ పట్టుకునేందుకు ప్రయత్నించారు. తప్పించుకునే ప్రయత్నంలో డీసీపీ, అతని గన్ మెన్ పై చైన్ స్నాచర్లు కత్తితో దాడికి దిగారు. ఈ క్రమంలో గన్ మెన్ అక్కడే పడిపోయాడు. కత్తితో బెదిరిస్తూనే ఓ దొంగ ఛాదర్ ఘాట్ సమీపంలోని ఇసామియా బజార్ టెలివిజన్ గల్లీలోకి ప్రవేశించారు. అక్కడి నుండి బయటపడేందుకు దారి లేక పోవడంతో భవనంపైకి ఎక్కి భవనం వెనుక భాగంలో ఉన్న విక్టోరియా ప్లే గ్రౌండ్‌లోకి దూకే ప్రయత్నం చేశాడు. అప్రమత్తమైన డీసీపీ గన్ తీసుకొని రెండు రౌండ్ల కాల్పులు జరిపారు. నిందితుడు ఒమర్ అన్సార్ చేతి భుజం, కడుపులో బుల్లెట్లు తగిలి గాయాలయ్యాయి. కాగా ఈ ఘటనలో మరొక మొబైల్ స్నాచర్ తప్పించుకున్నాడు. ఈ దాడిలో డీసీపీ మెడ, కాలీ భాగంలో స్వల్పగాయాలయ్యాయి. గన్ మెన్ కింద పడిపోవడంతో అస్వస్థతకు గురయ్యాడు. సమాచారం అందుకున్న పోలీస్ అధికారులు ఘటనా స్థలానికి చేరుకొని డీసీపీని, గన్ మెన్, నిందితుడు ఒమర్ అన్సారీని వైద్య చికిత్సల నిమిత్తం ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు అన్ని కోణాల్లో విచారిస్తున్నారు. విషయం తెలుసుకున్న సీపీ సజ్జనార్, పోలీస్ అధికారులు సంఘటనా స్థలానికి వెళ్లారు. పూర్తి వివరాలను అధికారులను సీపీ అడిగి తెలుసుకున్నారు.

**ఆత్మ రక్షణలో భాగంగానే కాల్పులు జరిపారు: నగర సీపీ సజ్జనార్**

చాదర్‌ఘాట్‌లో కాల్పుల ఘటనలో ఇద్దరు దొంగలు గాయపడ్డారని సీపీ సజ్జనార్ తెలిపారు. ఘటనా స్థలిని పరిశీలించిన సీపీ మీడియాకు వివరాలను వెల్లడించారు. రౌడీషీటర్, మొబైల్ స్నాచర్స్ ఇద్దరూ

మిగితా 2వ పేజీలో

# ఫిబ్రవరి 25 నుంచి ఇంటర్ పరీక్షలు

- మార్చి 18 వరకు నిర్వహణ
- ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

Telangana State Board of Intermediate Education

రాష్ట్రంలో ఇంటర్మీడియెట్ వార్షిక పరీక్షల నిర్వహణలో సమూల మార్పులు చోటుచేసుకున్నాయి. థియరీ పరీక్షలు 80 మార్కులకే జరగనున్నాయి. ఇంటర్నల్స్‌కు 20 మార్కులుంటాయి. ఈ నిర్ణయం వచ్చే విద్యాసంవత్సరం (2026–27) నుంచి అమల్లోకి రానుంది. శనివారం హైదరాబాద్‌లోని నాంపల్లిలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఇంటర్ బోర్డు కార్యదర్శి ఎస్ కృష్ణ ఆదిత్య మాట్లాడుతూ ఇంటర్మీడియెట్ వార్షిక పరీక్షలు ఫిబ్రవరి 25 నుంచి ప్రారంభమవుతాయనీ, మార్చి 18 వరకు జరుగుతాయని వివరించారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం సైన్స్ విద్యార్థులకు కూడా ప్రాక్టికల్ పరీక్షలను నిర్వహిస్తామని చెప్పారు. ఇంటర్‌లో కొత్తగా అకౌంటెన్సీ, కామర్స్, ఎకనామిక్స్ (ఏసీఈ) గ్రూపును ప్రవేశపెట్టబోతున్నామని వివరించారు. ఈ నిర్ణయాలు కూడా వచ్చే విద్యాసంవత్సరం (2026–27) నుంచి అమలు చేయాలని నిర్ణయించామని చెప్పారు. ఇంటర్ థియరీ పరీక్షలను 80 మార్కులకే నిర్వహిస్తామని అన్నారు. మిగిలిన 20 మార్కులను ఇంటర్నల్స్ నిర్వహిస్తామన్నారు. సబ్జెక్టులతో పాటు లాంగ్వేజెస్ కూడా ఇదే విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించామని చెప్పారు. ఇప్పటి వరకు ఇంటర్ ద్వితీయ సంవత్సరం సైన్స్ విద్యార్థులకు మాత్రమే ప్రాక్టికల్ పరీక్షలను నిర్వహిస్తున్నామని అన్నారు. వచ్చే విద్యాసంవత్సరం నుంచి ప్రథమ సంవత్సరం సైన్స్ విద్యార్థులు కూడా ప్రాక్టికల్ పరీక్షలుంటాయని స్పష్టం చేశారు. ఇప్పటి వరకు అమలు చేసిన 30 మార్కులను ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 15 మార్కులకు, ద్వితీయ సంవత్సరంలో 15 మార్కులకు ప్రాక్టికల్ పరీక్షలను నిర్వహిస్తామని వివరించారు. ఫిజిక్స్, కెమిస్ట్రీ, బాటనీ, జువాలజీ వంటి సబ్జెక్టులకు నిర్వహిస్తామని చెప్పారు. ప్రస్తుతం ఇంగ్లీష్ మాత్రమే అంతర్గత పరీక్షలు నిర్వహిస్తున్న నేపథ్యంలో వచ్చే విద్యా సంవత్సరం నుంచి సంస్కృతం, తెలుగు ఇతర ఆర్ట్స్, కామర్స్ అన్ని సబ్జెక్టులకూ ఇంటర్నల్ మార్కులు ఉంటాయని

మిగితా 2వ పేజీలో

## కర్నూలు ట్రాజెడీ
## రోడ్డు మీద బైక్ పడి ఉండటమే ప్రమాదానికి కారణం

బలగం టీవీ, అమరావతి



ఏపీ కర్నూలు జిల్లా కల్లూరు మండలం చిన్నటేకూరు గ్రామం వద్ద జరిగిన వేమూరి కావేరి ప్రైవేట్ బస్సు దగ్ధ ఘటనలో కీలక వివరాలు వెలుగులోకి వచ్చాయి. ఈ ఘటనలో 19 మంది సజీవంగా దహనమయ్యాగా, ద్విచక్ర వాహనదారుడు శివశంకర్ మృతి చెందారు. కర్నూలు జిల్లా ఎస్పి విక్రాంత్ పాటిల్ వెల్లడించిన వివరాల ప్రకారం, ప్రమాదానికి కారణం బస్సు వాహనం కాదు. రోడ్డుపై పడి ఉన్న బైక్‌ను బస్సు ఢీ కొట్టడం వలనే ఘటనం సంభవించిందని తెలిపారు.

శివశంకర్ తన పల్సర్ బైక్ను నడుపుతూ వెనుక కూర్చున్న ఎర్రి స్వామి (అలియాస్ నాని)తో ప్రయాణిస్తున్నారని పోలీసులు గుర్తించారు. వారు లక్ష్మీపురం గ్రామం నుంచి సుమారు రెండు గంటలకు బయలుదేరారు. మార్గమధ్యంలో, కియా షోరూం సమీపంలో హెచ్‌పి పెట్రోల్ బంక్ వద్ద రాత్రి సుమారు 2:24 గంటలకు 300 రూపాయల ఇంధనం తీసుకున్నారు. కొద్దిసేపటి తర్వాత చిన్నటేకూరు సమీపంలో బైక్ స్కిడ్ అయ్యింది, మరియు రోడ్డుకు కుడిపక్కన ఉన్న డివైడర్‌ను ఢీ కొట్టడంతో శివశంకర్ అక్కడికక్కడే మృతి చెందారు. వెనుక ఉన్న స్వామి చిన్న గాయాలతో బయటకు వచ్చారు. ప్రమాద స్థలంలో బైక్‌ను సర్దడానికి ప్రయత్నించేటప్పుడు, కావేరి ట్రావెల్స్ బస్సు బైక్‌ను ఢీ కొట్టి కొద్దిరోజుల దూరం తీసుకెళ్లింది. బస్సు కింద మంటలు వ్యాపించడంతో స్వామి తన సొంత తుగ్గలికి వెళ్లిపోయారు. ఉలిందకొండ పోలీస్ స్టేషన్లో ఈ ఘటనకు సంబంధించి కేసు నమోదు అయ్యింది. జిల్లా ఎస్పి విక్రాంత్ పాటిల్ తెలిపినట్టు, దర్యాప్తు కొనసాగుతున్నది.

## మనం చేసిన అభివృద్ధిని గుర్తు చేయాలి




- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

బలగం టీవీ, హైదరాబాద్

జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఉప ఎన్నికల ప్రచారంలో అనుసరించాల్సిన వ్యూహంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దిశానిర్దేశం చేశారు. తెలంగాణ భవన్‌లో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లతో ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో నాయకుల ందరూ కలిసికట్టుగా పని చేయాలని కేటీఆర్ పిలుపు నిచ్చారు. హైదరాబాద్ నగరంలో బీఆర్ఎస్ ఉన్న అపూర్వమైన బలాన్ని ఈ ఉప ఎన్నికలో చాటాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. "హైదరాబాద్ నగర ప్రజలు మన పార్టీ పట్ల అద్భుతమైన నమ్మకాన్ని చూపించి వందకు వందశాతం సీట్లను గత ఎన్నికల్లో మన పార్టీకే కట్టబెట్టారు. ఆ నమ్మకాన్ని నిలబెట్టుకోవాలి" అని ఆయన అన్నారు.

నగర నాయకులకు, జీహెచ్ఎంసీ కార్పొరేటర్లకు హైదరాబాద్ సమస్యలపై అవగాహన ఉందని కేటీఆర్ తెలిపారు. హైదరాబాద్ నగరం కోసం గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన కృషి, చేపట్టిన అన్ని కార్యక్రమాలను ప్రజలకు మరోసారి గుర్తు చేయాలని సూచించారు. "మన ప్రభుత్వ హయాంలోనగరంలోని ప్రతి గల్లీలో రహదారుల నిర్వహణ నుంచి మొదలుకొని ఎస్ఆర్‌డీపీ ద్వారా చేపట్టిన అద్భుతమైన ఫ్లై ఓవర్లు, 20వేల లీటర్ల ఉచిత తాగు నీటి పథకం, ఆటంకాలు లేకుండా నీటి సరఫరా, అద్భుతమైన పారిశుధ్య నిర్వహణ, ప్రతి ఒక్కరికి అందిన అభివృద్ధి సంక్షేమ ఫలాల వరకు అన్నింటిని ప్రజలకు వివరించాలి" అని ఆయన దిశానిర్దేశం చేశారు.

మిగితా 2వ పేజీలో

# కార్తీక దీపోత్సవాన్ని కన్నుల పండుగగా జరపాలి



- ఎండోమెంటు ఉన్నతాధికారులకు రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆదేశం

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

కార్తీక దీపోత్సవాన్ని కన్నుల పండగలా నిర్వహించాలనీ, రాష్ట్రంలోని ప్రతి దేవాలయం దీపాలతో అలకరించాలని ఎండోమెంటు ఉన్నతాధికారులను రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆదేశించారు. ఈ ఏడాది కార్తీక దీపోత్సవం 22 నుంచి 19 వరకు నిర్వహించనున్న నేపథ్యంలో ఎండోమెంటు ఉన్నతాధికారులు శైలజ రామయ్యర్, హరీశ్, డిప్యూటీ కమిషనర్లు, అసిస్టెంటు కమిషనర్లు, ఈవోలతో శనివారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్రవ్యాప్తంగా అన్ని దేవాలయాల ఈవోలు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... ఈ సంవత్సరం కూడా సామూహిక కార్తీక దీపోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించుటకు దేవాదాయ శాఖ చేసే ఏర్పాట్లను మంత్రికి అధికారులు వివరించారు. ప్రతిరోజు సామూహిక కార్తీక దీపోత్సవాన్ని సాయంత్రం 6గంటల నుండి జరపాల్సి ఉంటుందనీ, ఈ కార్యక్రమంలో పాల్గొనే భక్తులకు మట్టి ప్రమిదలు, వత్తులు, నూనెతో పాటుగా పసుపు కుంకుమ తాంబూలాలను మహిళా భక్తులకు అందచేస్తున్నట్టు వివరించారు. కార్తీక సోమవారం నాడు సామూహిక కార్తీక దీపోత్సవంలో పాల్గొనే భక్తులకు పైన పేర్కొన్న వస్తువులతో పాటు కుంకుమ, పసుపు, ఆకులు, వక్కలు, ఏదైనా పండు, కనుము ప్రధాన దేవాలయలలో భక్తులకు ఇస్తున్నట్టు తెలిపారు. సామూహిక కార్తీక దీపోత్సవంలో భక్తులు దీపాలు ఒదలటానికి అవసరమైనచోట తాత్కాలిక వాటర్ పాండ్స్ కూడా ఏర్పాటు చేస్తున్నట్టు వివరించారు. నదీ పరివాహక ప్రాంతాలలోని దేవాలయాలలో నది హారతి నిర్వహిస్తున్నామని చెప్పారు. ఎక్కడైతే ఎక్కువ సంఖ్యలో భక్తులు వస్తారో... అక్కడ స్థానికంగా రెవెన్యూ, పోలీసు, ట్రాఫిక్ విభాగాల సాయంతో చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. మహిళలు, ఇతర భక్తులకు మంచి నీటి వసతి కల్పించాలన్నారు. శానిటేషన్ వర్కర్స్ సేవలు వినియోగించుకోని ఆలయ పరిసర ప్రాంతాల్లో పరిశుభ్రతకు ప్రత్యేకంగా చర్యలు తీసుకోవాలన్నారు. గత

## చిరంజీవి అనుమతి తప్పనిసరి

- హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టు

బలగం టీవీ, హైదరాబాద్



ప్రముఖ తెలుగు సినీ హీరో చిరంజీవి వ్యక్తిగత హక్కులకు రక్షణ కల్పిస్తూ హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టు శనివారం మధ్యంతర ఉత్తర్వులు మంజూరు చేసింది. ఇకపై ఎవరైనా చిరంజీవి అనుమతి లేకుండా ఆయన ఫొటోలు, గొంతు లాంటివి ఎవరైనా ఉపయోగిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని న్యాయస్థానం.. పోలీసులను ఆదేశించింది. ఈ ఉత్తర్వుల ప్రకారం పిటిషన్‌లో పేరు పొందిన పలువురితోపాటు ఎవరైనా వ్యక్తి లేదా సంస్థ అయినా చిరంజీవి వ్యక్తిత్వ, ప్రచార హక్కులను ఉల్లంఘించే విధంగా ముందస్తు అనుమతి లేకుండా వాణిజ్య ప్రయోజనాల కోసం ఆయన పేరు, గాత్రం తదితర అంశాల్ని వినియోగించడాన్ని న్యాయస్థానం నిషేధించింది. అలానే కృత్రిమ మేధస్సు (ఏఐ)తో తయారు చేసిన మార్ఫింగ్ ఫొటోలు, వీడియోలు వినియోగించడాన్ని కూడా ఆపివేయాలని హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టు దృష్టికి చిరంజీవి తీసుకువచ్చారు. ఆయన పేరుతో వీడియో, మీమ్స్ చేసి అనుమతి లేకుండా వినియోగిస్తున్నారని.. తద్వారా ఆయన ఖ్యాతి, గౌరవానికి నష్టం కలుగుతోందని చిరంజీవి తరపు న్యాయవాదులు కోర్టులో ప్రస్తావించారు. ఈ ఆదేశాల ప్రకారం చిరంజీవి పేరు, స్టేజ్ టైటిల్స్, గొంతు, ఆయనకు మాత్రమే సొంతమైన ఇతర వ్యక్తిత్వ లక్షణాలనీ, ఏ రూపంలోనైనా ఏ మాధ్యమంలోనైనా ఉపయోగించొద్దని న్యాయస్థానం ఆదేశించింది. గతంలో నాగార్జున కూడా ఇలానే న్యాయస్థానం నుంచి మధ్యంతర ఉత్తర్వులు తెచ్చుకున్నారు.

## 'తెలంగాణ రైజింగ్'లో భాగస్వామ్యం కండి

- ఆస్ట్రేలియాలో 'ఇండియన్' సీఈవోలకు మంత్రి శ్రీధర్ బాబు పిలుపు

బలగం టీవీ, హైదరాబాద్



'తెలంగాణ రైజింగ్' లక్ష్య సాధనలో భాగస్వామ్యం కావాలని ఆస్ట్రేలియాలోని పలు కంపెనీల ఇండియన్ సీఈవోలకు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పిలుపునిచ్చారు. విరివిగా పెట్టుబడులు పెట్టి రాష్ట్ర పురోగతిలో పాలు పంచుకోవాలని కోరారు. ఆ దేశ పర్యటనలో భాగంగా శనివారం సిడ్నీలో 'ది సెంటర్ ఫర్ ఆస్ట్రేలియా ఇండియా రిలేషన్స్' ఆధ్వర్యంలో నిర్వహించిన బిజినెస్ కాంక్లేవ్‌లో వారితో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. దేశంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాల్లో "తెలంగాణ" ముందు వరుసలో ఉందని అన్నారు. తక్కువ సమయంలో పటిష్టమైన ఆర్థిక వ్యవస్థ, స్థిరమైన పాలన కారణంగా అంతర్జాతీయ పెట్టుబడులకు రాష్ట్రం సురక్షితమైన గమ్యస్థానంగా మారిందని తెలిపారు. తెలంగాణలో పారిశ్రామి కాభివృద్ధికి అనుకూలించే అంశాలు, పెట్టుబడి అవకాశాలు, ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, ప్రగతిశీల విధానాలు, ఎకో సిస్టం, సింగిల్ విండో అనుమతుల వ్యవస్థ తదితర అంశాలపై ఈ సందర్భంగా మంత్రి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. అంతర్జాతీయ, జాతీయ దిగ్గజ సంస్థల భాగస్వామ్యంతో పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా 'ఇండస్ట్రీ రెడీ వర్క్ ఫోర్స్'ను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా తీసుకుంటున్న చొరవను వివరించారు. ఏఐ, డేటా అనలిటిక్స్, మెషిన్‌లెర్నింగ్, గేమింగ్, యానిమేషన్, వీఎఫ్ఎక్స్, సెమీకండక్టర్లు, ఏరోస్పేస్, డిఫెన్స్, అడ్వాన్స్డ్ మాన్యుఫ్యాక్చరింగ్, గ్రీన్ ఎనర్జీ, ఈవీల తయారీ తదితర రంగాల్లో తెలంగాణ లో అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున అన్ని రకాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో 'ది సెంటర్ ఫర్ 'ఆస్ట్రేలియా– ఇండియా రిలేషన్స్' చైర్‌పర్సన్ స్వాతిదవే, బిజినెస్ కౌన్సిల్ నేషనల్ అసోసియేట్ చైర్మెన్ ఇర్ఫాన్ మాలిక్, ఈటీపీఎల్ డైరెక్టర్ సౌరవ్ బెనర్జీ తదితరులు పాల్గొన్నారు.

# నగరంలో కాల్పుల కలకలం

(మొదటి పేజీ తరువాయి)

శనివారం సాయంత్రం ఛాదర్ ఘాట్ సమీపంలో సెల్‌ఫోన్ చోరీ చేసి పారిపోతున్న క్రమంలో అటుగా వెళుతున్న డీసీపీ గమనించి వారిని పట్టుకునే ప్రయత్నం చేశారు. కాగా నిందితులు తప్పించుకునే ప్రయత్నంలో డీసీపీ, గన్‌మెన్‌పై కత్తితో దాడికి పాల్పడ్డారు. ఈ క్రమంలో గన్‌మెన్ కిందపడిపోయారు. వెంటనే తేరుకున్న డీసీపీ, గన్‌మెన్ ఆత్మ రక్షణలో భాగంగానే దొంగలపై కాల్పులు జరిపారు. కాల్పుల్లో ఇద్దరు నిందితులు గాయపడ్డారని తెలిపారు. ఒమర్‌పై కాలాపత్తర్ పోలీస్ స్టేషన్‌లో రౌడీషీట్ నమోదుకాగా, సెల్‌ఫోన్ల చోరీ కేసులతోపాటు 25 కేసులలో నిందితుడు అని సీపీ తెలిపారు. 2016లో కామటిపురం పోలీస్‌స్టేషన్‌లో పీడీ యాక్టు కేసులో ఏడాది జైల్లో ఉన్నాడని, 2020లో హుస్సేనీ ఆలమ్ పోలీస్ స్టేషన్ పీడీ యాక్టు కేసులో సైతం మరో ఏడాది చంచల్‌గూడా జైల్లో ఉన్నాడని తెలిపారు. జైలు నుంచి బయటకు వచ్చినప్పటికీ ఒమర్ ప్రవర్తనలో మార్పురాలేదన్నారు.

# ఫిబ్రవరి 25 నుంచి ఇంటర్ పరీక్షలు

(మొదటి పేజీ తరువాయి)

అన్నారు. వచ్చే ఏడాది నుంచి ఎంఈసీ గ్రూప్ విద్యార్థులకు ప్రత్యేకంగా గణితం ప్రశ్నాపత్రాన్ని రూపొందించాలని నిర్ణయించామని చెప్పారు. భవిష్యత్‌లో విద్యార్థులకు మేలు కలిగేలా 12 ఏండ్ల తర్వాత ఇంటర్ సిలబస్‌ను మారుస్తున్నామని అన్నారు. ఎన్‌సీఈఆర్టీ మార్గదర్శకాలకు అనుగుణంగా సిలబస్‌లో మార్పులుంటాయని చెప్పారు. సిలబస్ మార్పులకు సంబంధించిన సబ్జెక్టు నిపుణులతో వచ్చేనెల ఒకటి నుంచి డిసెంబర్ 15 వరకు 45 రోజులపాటు కసరత్తు చేస్తామని వివరించారు. వారి అభిప్రాయాలకు అనుగుణంగా నివేదికను రూపొందించనున్నట్టు చెప్పారు. కొత్త సిలబస్‌కు సంబంధించిన పాఠ్యపుస్తకాల ముద్రణను ఏప్రిల్ నెలాఖరు నాటికి లేదా మే మొదటి వారంలోగా పూర్తి చేసి విద్యార్థులకు వచ్చే విద్యాసంవత్సరం ప్రారంభం రోజే అందించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. నూతన సిలబస్‌ను రూపొందించడంతోపాటు పాఠ్యపుస్తకాలపై క్యూఆర్ కోడ్‌ను ముద్రిస్తామని వివరించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలతో డిజిటలైజ్ చేస్తున్నామని అన్నారు. వచ్చే విద్యాసంవత్సరంలో ప్రాక్టికల్స్‌లో జంబ్లింగ్ విధానం అమలుపై పరిశీలిస్తామన్నారు. టీస్టెమ్ ద్వారా ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో చదివే విద్యార్థులు సమీపంలోని ప్రభుత్వ లేదా ప్రయివేటు పాలిటెక్నిక్, ఇంటర్, డిగ్రీ, పీజీ, యూనివర్సిటీల్లోని ల్యాబ్‌లను వాడుకునేలా ప్రత్యేక పోర్టల్‌ను అందుబాటులోకి తెస్తామన్నారు. రాష్ట్రంలో 14 మిక్స్‌డ్ ఆక్యుపెన్సీ ఉన్న ప్రయివేటు జూనియర్ కాలేజీలకు అనుబంధ గుర్తింపు ఇవ్వలేదనీ, అందులో మూడు వేల మంది విద్యార్థులు చదువుతున్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ (సీవోఈ) జయప్రద బాయి, జాయింట్ సెక్రెటరీలు భీం సింగ్, జ్యోత్స్న రాణి, వసుంధర, రమణకుమార్ పాల్గొన్నారు.

# త్వరలో డీసీసీ అధ్యక్షుల ప్రకటన

(మొదటి పేజీ తరువాయి)

అధిష్టానం ప్రకటిస్తుందని ఏఐసీసీ వర్గాలు తెలిపాయి. ప్రధానంగా తెలంగాణలోని ప్రస్తుత తాజా రాజకీయ పరిణామాలు, మంత్రుల మధ్య విభేదాలు, పార్టీ అంతర్గత అంశాలపై చర్చించనున్నట్టు సమాచారం. వీటితో పాటు జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక, లోకల్ బాడీ ఎన్నికలపై హైకోర్టు స్టే, మంత్రివర్గ విస్తరణ, ఇతర అంశాలను కేసీకి సీఎం వివరించినట్టు విశ్వసనీయంగా తెలిసింది.

సమర్థులైన వారినే డీసీసీ అధ్యక్ష పదవులకు ఎంపిక చేస్తామని పీసీసీ అధ్యక్షులు మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. అయితే ఈ పదవుల ఎంపికలోనూ సామాజిక న్యాయం ఉంటుందని చెప్పారు. కనీసం పార్టీలో ఐదేండ్లు పనిచేసిన వారే ఈ పదవికి అర్హులని నిబంధన పెట్టినట్టు వెల్లడించారు. డీసీసీల నియామకాల్లో అందరి అభిప్రాయాలను అధిష్టానం తీసుకుంటుందన్నారు. ఇప్పటికే జిల్లాల అధ్యక్షులకు పెద్ద ఎత్తున దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. సమర్థవంతమైన వారిని డీసీసీ అధ్యక్ష పదవికి ఎంపిక చేస్తామని అన్నారు. అన్ని సామాజిక వర్గాలకు ప్రాధాన్యత ఉంటుందని వివరించారు. అలాగే ఇతర పదవుల్లో ఉన్నవారికి డీసీసీ పదవి ఇవ్వకూడదనే నిబంధన ఉందని చెప్పారు.

# మూసాపేట లో భారీ అగ్నిప్రమాదం

- **రూ. 50 కోట్ల ఆస్తి నష్టం**

**బలగం టీవీ, హైదరాబాద్**



కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని మూసాపేట్ గూడ్స్ షెడ్ రోడ్డులో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో సుమారు రూ. 50 కోట్ల ఆస్తి నష్టం జరిగినట్టు అధికారులు అంచనా వేస్తున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం ఉదయం ఇండియన్ కంటైనర్ కార్పొరేషన్ డిపోలోని గోడౌన్ నంబర్లు 6, 7, 8లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. క్షణాల్లోనే మంటలు వ్యాపించడంతో అక్కడ నిల్వ ఉంచిన బ్యాటరీలు, లిక్కర్ బాటిళ్లు పూర్తిగా అగ్నికి ఆహుతయ్యాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని ఆరు ఫైర్ ఇంజన్లతో మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. అగ్నిమాపక సిబ్బందికి తోడుగా డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్, పోలీసులు సహాయ చర్యల్లో పాల్గొన్నారు. అగ్నిప్రమాదానికి గల కారణాలు స్పష్టంగా తెలియరాలేదు. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణమా, లేక మరే ఇతర కారణమా అనే దానిపై పోలీసులు విచారణ జరుపుతున్నారు. ఎటువంటి ప్రాణనష్టం జరగలేదు.

## పెద్ద అంబర్‌పేట్ ఓఆర్ఆర్ వద్ద బస్సు బోల్తా

**బలగం టీవీ, హైదరాబాద్**

రంగారెడ్డి జిల్లా పెద్ద అంబర్‌పేట్ ఓఆర్ఆర్ వద్ద ఓ ప్రయివేట్ ట్రావెల్స్ బస్సు బోల్తా పడింది. అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఈ ఘటనలో తొమ్మిది మందికి గాయాలయ్యాయి. సీఐ అశోక్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ మియాపూర్ నుంచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుంటూరుకు బయలుదేరిన ప్రయివేటు ట్రావెల్స్ బస్సులో ఆరుగురు ప్రయాణికులు, ఇద్దరు డ్రైవర్లు, కండక్టర్ ఉన్నారు. బస్సు పెద్ద అంబర్‌పేట ఓఆర్ఆర్ వద్దకు రాగానే అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టడంతో బోల్తా పడింది. దాంతో బస్సులో ఉన్న తొమ్మిది మందికి తీవ్ర గాయాలయ్యాయి. వారిలో నలుగురు ప్రయాణికులను హయత్‌నగర్‌లోని ఓ ప్రయివేట్ ఆస్పత్రికి, మరో ఇద్దరు ప్రయాణికులు, ఇద్దరు డ్రైవర్లు, కండక్టర్‌ను కంచన్‌బాగ్‌లోని అపోలో (డీఆర్‌డీఓ) ఆస్పత్రికి తరలించారు. డ్రైవర్ నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగినట్టు ప్రాథమిక అంచనా. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.ఏపీలోని కర్నూలులో ఓ ప్రయివేటు ట్రావెల్స్ బస్సు ప్రమాదానికి గురైన ఘటన మరవకముందే ఈ ఘటన జరగడం ఆందోళన కలిగిస్తోంది.

# నిరుద్యోగుల పదేళ్ల నిరీక్షణకు ముగింపు పలికాం

- **ఏడాదిన్నర కాలంలోనే 80 వేల కొలువులు ఇచ్చాం**
- **మాది ఉద్యోగ నామ ప్రభుత్వం**
- **పదవులు పోయిన రాజకీయ నిరుద్యోగులే నిరుద్యోగ బాకీ కార్డుల పేరుతో డ్రామాలు**
- **చిట్టచివరి మనిషి సంక్షేమమే లక్ష్యంగా ఎంపీడీవోలు పనిచేయాలి**
- **రాజేంద్రనగర్‌లో డిపిఓ, ఎంపీడీవో శిక్షణ ముగింపు కార్యక్రమం లో మంత్రి సీతక్క**
- **దిశా నిర్దేశం చేసిన మంత్రి సీతక్క**

**బలగం టీవీ, హైదరాబాద్**




రాజేంద్రనగర్‌లోని తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ ఆడిటోరియంలో డిపిఓ, ఎంపీడీవో శిక్షణ ముగింపు కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీధర్, డైరెక్టర్ సృజన, TGIRD సీఈఓ నిఖిల పాల్గొన్నారు.

గ్రూప్ వన్ పరీక్ష ద్వారా ఎంపికై రెండు వారాలపాటు శిక్షణ పూర్తి చేసుకున్న డిపిఓ, ఎంపీడీవో లకు మంత్రి సీతక్క ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన మంత్రి సీతక్క, "ఇంతకాలం మీరు విద్యార్థులు, నేటి నుంచి ఉన్నతాధికారులు. తెలంగాణ రాష్ట్రంలో మొట్టమొదటి గ్రూప్ వన్ బ్యాచ్ మీది, అందుకే తెలంగాణ చరిత్రలో మీకు ప్రత్యేక స్థానం ఉంది" అని అభినందించారు. "పదేళ్ల నిరీక్షణకు ఇప్పుడు ఫలితం దొరికింది. రేవంత్ రెడ్డి గారి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం మీలాంటి ప్రతిభావంతులకి ఉద్యోగావకాశాలు కల్పించింది. ఏడాదిన్నర కాలంలోనే 80 వేల ప్రభుత్వ ఉద్యోగాలు ఇవ్వగలిగాము. మాది ఉద్యోగ నామ ప్రభుత్వం . ప్రజా ప్రభుత్వమే ప్రభుత్వ ఉద్యోగాల ప్రభుత్వం" అని అన్నారు.

తమ పదవులు కోల్పోయి నిరుద్యోగులుగా మారిన కొందరు రాజకీయ నాయకులు ఇప్పుడు నిరుద్యోగ కార్డులు అంటూ డ్రామాలు ఆడుతున్నారని మంత్రి వ్యాఖ్యానించారు. నిరుద్యోగులను నిండా ముంచిన టిఆర్ఎస్ నాయకులను నిరుద్యోగులు నిలదీయాలన్నారు. గ్రామీణ అభివృద్ధిలో ఎంపీడీవోల పాత్ర ఎంతో కీలకమని, మండల స్థాయిలో అన్ని శాఖలను సమన్వయం చేస్తూ అభివృద్ధి దిశగా నడిపించాల్సిన బాధ్యత ఎంపీడీవోలదేనని వివరించారు. ప్రతి మండలాన్ని ఆదర్శ మండలంగా తీర్చిదిద్దే లక్ష్యంతో పని చేయాలని, ప్రజలతో సత్సంబంధాలు కొనసాగిస్తూ క్షేత్రస్థాయిలో పర్యటనలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.

"ప్రజలను ముందుగా ప్రేమించగలగాలి, వారి బాధలను అర్థం చేసుకోవాలి. అప్పుడు మాత్రమే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుంది" అని ఆమె అన్నారు. మండల సమగ్ర స్వరూపం, శాఖల వారీగా పరిస్థితులు ఎంపీడీవోల చేతుల్లో ఉండాలని, ప్రగతి నివేదికలు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచాలని ఆమె సూచించారు. ఎంతో కష్టపడి లక్షలాది మందితో పోటీ పడి గ్రూప్ వన్ ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులు అదే పట్టుదలతో ఉద్యోగ విరమణ వరకు ప్రజాసేవలో నిలబెట్టుకోవాలని మంత్రి సీతక్క పిలుపునిచ్చారు.

మానవసేవే మాధవసేవ అని గుర్తుచేసిన మంత్రి సీతక్క, "మండలాభివృద్ధి ప్రదాతలు ఎంపీడీవోలు. చివరి మనిషికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరాలంటే మీరు ముందుండాలి. అసలైన అర్హులను గుర్తించి వారికి సహాయం చేయాలి. పేదలకు ప్రభుత్వం చుట్టం, ప్రభుత్వ ఉద్యోగులే చుట్టాలు. అందుకే వారి జీవన ప్రమాణాలను పెంచడం మీ ప్రధాన బాధ్యత" అని సూచించారు. చీకట్లో ఉన్న జీవితాలకి వెలుగులు నింపాలని, నిబద్ధతతో పనిచేస్తే ఎందరో జీవితాలను మార్చవచ్చని సూచించారు.

ప్రజలకు, ప్రభుత్వానికి వారధులుగా అధికారులు వ్యవహరించాలంటూ ఆమె పిలుపునిచ్చారు. ఉద్యోగ బాధ్యత నెరవేర్చే క్రమంలో ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా తల్లిదండ్రుల ఆశయాలను నిలబెట్టాలని మంత్రి సీతక్క సూచించారు. కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, శిక్షణ పొందిన అభ్యర్థులు మంత్రి సీతక్కను ఘనంగా సత్కరించారు. ప్రజా ప్రభుత్వానికి వారధులుగా ఎంపీడీవోలు నిలవాలని మంత్రి సీతక్క పిలుపునిచ్చారు. ప్రిన్సిపల్ సెక్రెటరీ శ్రీధర్, డైరెక్టర్ సృజన మాట్లాడుతూ.. ఫ్లెక్సిబుల్ మైండ్ తో, నిబద్ధతతో ప్రజలకు సేవ చేయాలని కోరారు. రూల్ ఆఫ్ లా, చట్టాన్ని రాజ్యాంగాన్ని కాపాడుతూ విధులు నిర్వహించాలని సూచించారు.

# మనం చేసిన అభివృద్ధిని గుర్తు చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

మరోవైపు, కాంగ్రెస్ పార్టీ వైఫల్యాలను ప్రజలకు గుర్తు చేయాలని కేటీఆర్ సూచించారు. హైదరాబాద్ నగరంలో రోజురోజుకు దిగజారుతున్న కనీస ప్రజల అవసరాలైన పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, మురికినీటి కాలువల నిర్వహణ వంటి వాటి సమస్యలను ప్రజలకు వివరించాలని కేటీఆర్ కోరారు. కాంగ్రెస్ పార్టీ హైదరాబాద్ నగర అభివృద్ధిని పూర్తిగా పక్కన పెట్టి కేవలం రాజకీయాలకే పాల్పడుతుందని ఆయన విమర్శించారు. హైదరాబాద్‌లో కాంగ్రెస్ మోసాలను, 22 నెలల పాలనలో జరిగిన 'హైడ్రా విధ్వంసం'ను ఎక్కడికక్కడ వివరించాలని తెలిపారు. అన్ని వర్గాల ప్రజలకు కాంగ్రెస్ పార్టీ హామీలు ఇచ్చి మోసం చేసిన తీరును పార్టీ శ్రేణులు వివరించాలని ఆయన దిశానిర్దేశం చేశారు.

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో పార్టీ గెలిస్తే, రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో ఏకపక్షంగా గెలుస్తామని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. "ఇప్పటికే రెండుసార్లు జీహెచ్ఎంసీ పైన గులాబీ జెండా ఎగిరింది. మూడోసారి కూడా గులాబీ జెండా ఎగరడం ఖాయం" అని ఆయన అన్నారు.జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక మాత్రమే కాదని, హైదరాబాద్ నగరంలో రానున్న రోజుల్లో పార్టీ మారిన ఖైరతాబాద్, శేర్లింగంపల్లి ఎమ్మెల్యేల పైన అనర్హత వేటు కచ్చితంగా పడుతుందని, ఆ రెండు నియోజకవర్గాల్లో కూడా ఉప ఎన్నికలు తప్పవని కేటీఆర్ అన్నారు. వీటితోపాటు రాష్ట్రవ్యాప్తంగా పార్టీ మారిన ఎమ్మెల్యేల నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలు వస్తాయని తెలిపారు.

జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఉప ఎన్నిక విజయం ఖాయమని, అయితే మెజార్టీ కోసం మనం మరింత కష్టపడాలని కేటీఆర్ నాయకత్వానికి సూచించారు. బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత గోపీనాథ్‌కు ఓటు వేసేలా ప్రజలకు మన ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు చేసిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించాలని కోరారు.




**జూబ్లీహిల్స్ నుంచి బీఆర్ఎస్ జైత్రయాత్ర ప్రారంభం**

రాష్ట్రంలో ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పే సమయం వచ్చిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యానించారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ జైత్రయాత్ర ప్రారంభమవుతుందని, పార్టీ మరోసారి ప్రజల ఆశీర్వాదాలతో విజయపథంలో నడుస్తుందని ఆయన అన్నారు.

జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని షేక్‌పేట్ డివిజన్ బీజేపీ మాజీ అధ్యక్షుడు తోట మహేష్ ముదిరాజ్ తన అనుచరులతో కలిసి బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కేటీఆర్ గులాబీ కండువా కప్పి వారిని పార్టీ లోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మాట్లాడిన కేటీఆర్, "మోసాన్ని మోసంతోనే జయించాలి. ప్రజల నిజమైన అభివృద్ధి కోసం బీఆర్ఎస్‌నే మళ్లీ అధికారంలోకి తేవాలి" అని పిలుపునిచ్చారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు వాస్తవం కాలేదని, పేదల ఆశలు దెబ్బతిన్నాయని ఆయన మండిపడ్డారు. కేసీఆర్ పాలనలో ప్రజల కష్టాలు తగ్గాయని, ఉచిత మంచినీళ్లు, బస్తీ దవాఖానాలు, రూ.5 భోజనం, పింఛన్లు, రంజాన్ తోఫా వంటి పథకాలు తెలంగాణ అభివృద్ధికి దోహదపడ్డాయని గుర్తుచేశారు.

ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం రైతులు, మహిళలు, వృద్ధులను మోసం చేసిందని కేటీఆర్ తీవ్ర విమర్శలు చేశారు. "మేం మోసపోయాం.. కానీ ఇప్పుడు జూబ్లీహిల్స్ ప్రజలు మోసపోవద్దు. అందుకే మేం కూడా ఇక్కడికి వచ్చి ప్రచారం చేస్తాం" అని చెప్పారు. తెలంగాణలోని గరీబోళ్లు, కార్మికులు, రైతులు అందరూ జూబ్లీహిల్స్ వైపు చూస్తున్నారని, జైత్రయాత్ర ఇక్కడి నుంచే ప్రారంభమవుతుందని ఆయన స్పష్టం చేశారు. వచ్చే నెల 11న జరిగే పోలింగ్‌లో బీఆర్ఎస్‌కు ఓటు వేయాలని కేటీఆర్ ప్రజలను కోరారు. "మీ ఓటు తెలంగాణ భవిష్యత్తును నిర్ణయిస్తుంది. కేసీఆర్ పాలనలో సాధించిన అభివృద్ధిని కాపాడుకుందాం" అని ఆయన పిలుపునిచ్చారు.

# సిరిసిల్ల మున్సిపాలిటీ మాస్టర్ ప్లాన్ పకడ్బందీగా అమలు చేయాలి..




- **అమృత్ 2.0 కు సిరిసిల్ల మున్సిపాలిటీ ఎంపిక..**
- **వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం..**
- **ఇంచార్జి కలెక్టర్ గరీమా అగ్రవాల్**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

సిరిసిల్ల మున్సిపాలిటీ మాస్టర్ ప్లాన్ పకడ్బందీగా అమలు చేయాలని ఇంచార్జి కలెక్టర్ గరీమా అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. అమృత్ 2.0 పథకం కింద సిరిసిల్ల మున్సిపాలిటీలో మాస్టర్ ప్లాన్ అమలుకు మొదటి కన్సల్టేటివ్ వర్క్ షాప్ జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో వివిధ శాఖల అధికారులతో శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ గరీమా అగ్రవాల్ మాట్లాడుతూ.. జీఐఎస్ సాంకేతికత ఆధారంగా బేస్ మ్యాప్స్, ల్యాండ్ యూజ్ మ్యాప్స్, మాస్టర్ ప్లాన్‌లు, అర్బన్ జియో–పోర్టల్ సిరిసిల్ల మున్సిపాలిటీ అభివృద్ధికి దోహదపడుతుందని తెలిపారు. ఇప్పటికే సర్వే ఆఫ్ ఇండియా వారి ఆధ్వర్యంలో డ్రోన్ సర్వే పూర్తిచేయడంతో పాటు, సోషియో ఎకమిక్ సర్వే నిర్వహించినట్లు వెల్లడించారు. వివిధ జిల్లా శాఖ అధికారులు సంబంధిత వివరాలు మొత్తం అందజేయాలని తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలో ఆయా శాఖల్లో చేపట్టిన అభివృద్ధి పనులు, భవిష్యత్తులో చేపట్టబోయే అభివృద్ధి పనులకు చేసిన ప్రణాళికల వివరాలు అందించాలన్నారు. మాస్టర్ ప్లాన్ అమలుతో మున్సిపాలిటీ పరిధిలో పారిశుధ్యం, త్రాగునీరు, డ్రైనేజీలు, రోడ్లు, విద్యుత్ వంటి మౌళిక సదుపాయాలు మెరుగుపడతాయని వివరించారు.

వారం రోజుల్లోగా వివిధశాఖల జిల్లా అధికారులు సంబంధిత డేటా, ఇప్పటివరకు చేపట్టిన అభివృద్ధి, భవిష్యత్తులో చేపట్టాల్సిన పనుల వివరాలు అందజేయాలని సూచించారు. మాస్టర్ ప్లాన్ అమలులో సంబంధిత అధికారులం దరూ భాగస్వామ్యం అవ్వాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో సిరిసిల్ల ఆర్డీఓ వెంకటేశ్వర్లు, జీ ఐ ఎస్ హబ్ డీటీసీపీ ప్రాజెక్ట్ డైరెక్టర్ అశ్వినీ యాదవ్, డీ టీ సీ పీ వో వరంగల్ ఏడీ జ్యోతి, సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా, డీటీసీపీవో అన్సారి, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.




## జిల్లా ఇంచార్జి కలెక్టర్ కు రాజన్న ప్రసాదం అందజేసిన ఈఓ..

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

జిల్లా ఇంఛార్జి కలెక్టర్ గా అదనపు భాద్యతలు స్వీకరించిన గరీమా అగ్రవాల్ ను వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి ప్రసాదం అందజేసారు. శనివారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో జిల్లా ఇంచార్జి కలెక్టర్ గరీమా అగ్రవాల్ ను ఈఓ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపి, శాలువాతో సత్కరించారు. ఆలయ అర్చకులు వారికి వేద ఆశీర్వచనం అందజేశారు. అనంతరం రాజన్న ఆలయ విస్తరణ, అభివృద్ధి పనుల పురోగతిని ఈఓ జిల్లా ఇంఛార్జి కలెక్టర్ కు వివరించారు.



## ప్రభుత్వ భూమిలో రాత్రికి రాత్రి చెట్లు..!

- **సుమారు 5 ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమించుకున్న ఓ వ్యక్తి**
- **రెవెన్యూ అధికారులు స్పందించాలని గ్రామస్తుల నిరసన**

**బలగం టీవీ, తంగళ్లపల్లి**

మండేపల్లి గ్రామంలోని ఓ సర్వే నంబర్ లో గత కొన్ని నెలలుగా భూకబ్జాదారుడు రాత్రి పూట దున్నడం, భూమిలో రాత్రికి రాత్రి చెట్లు పెడుతుండడంతో గ్రామస్తులు శనివారం రోజున రెవిన్యూ అధికారులకు వివరించగా ఆర్ ఐ మధు, జిపిఓ వేణు రెవెన్యూ సిబ్బంది పరిశీలించారు. గ్రామస్తుల అభిప్రాయం ప్రకారం.. భూమి రెవెన్యూ కి చెందాలి లేకుంటే గ్రామ అభివృద్ధి కోసం వడ్ల బీటుకు అందజేయాలని కోరారు. భూమికి సంబంధించిన పత్రాలు ఉంటే రాత్రిపూట దున్నడమేంటని, రాత్రి పూట చెట్లు పెట్టడం ఏంటని ప్రశ్నించారు. ఇప్పటికే గ్రామంలోని 377 సర్వే నంబర్ లో 360 ఎకరాల భూమి ప్రభుత్వం స్వాధినం చేసుకుందని మిగిలిన భూమి ఇలాంటి భూకబ్జాదారుల చేతిలోకి వెళ్తున్నదన్నారు. గ్రామంలో పశువులు మేత వేయడానికి ఉపయోగపడుతుందని అనుకున్నామన్నారు. గ్రామానికి భవిష్యత్తు దృష్టిలో ఉంచుకొని క్రీడా ప్రాంగణానికి అందజేయాలని కోరారు.

## అందుబాటులో ఉండాలి.. సేవలు అందించాలి..

- **ఇంచార్జి కలెక్టర్ గరీమా అగ్రవాల్**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

ఖరీఫ్ సీజన్ సందర్భంగా రైతులకు అందుబాటులో ఉండాలని, సేవలు అందించాలని ఇంచార్జి కలెక్టర్ గరీమా అగ్రవాల్ ఆదేశించారు. ఖరీఫ్ సీజన్ నేపథ్యంలో జిల్లాలోని డిఆర్డిఓ, డిసిఓ, డిసిఎస్ఓ, డిసిఎంఎస్, మార్క్ ఫెడ్, మార్కెటింగ్ శాఖ, మెప్మా తదితర వ్యవసాయ తదితర శాఖల అధికారులతో ఇంచార్జ్ కలెక్టర్ గరీమా అగ్రవాల్శనివారం టెలి కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వరి, పత్తి, మక్కల ఇతర పంటల సాగు, దిగుబడి కొనుగోలు కేంద్రాలకు వస్తుందని వివరించారు. ఆయా శాఖల అధికారులు రైతులకు అందుబాటులో ఉండాలని, అన్ని వసతులు కల్పించాలని ఆదేశించారు. రైతులు తమ పంట ఉత్పత్తులకు మద్దతు ధర పొందేలా అవగాహన కల్పించాలని సూచించారు.

# జోర్డాన్‌లో చిక్కుకున్న 12 మంది తెలంగాణ కార్మికులను స్వంత ఖర్చులతో సురక్షితంగా రప్పించిన మాజీ మంత్రి హరీష్ రావు..

- **ప్రభుత్వాలపై బాధితుల ఆవేదన**

బలగం టీవీ, హైదరాబాద్?:

ఉపాధి కోసం జోర్డాన్ వెళ్లి అక్కడ చిక్కుకుపోయిన తెలంగాణకు చెందిన 12 మంది వలస కార్మికులను మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు తన చొరవతో స్వస్థలానికి చేర్చారు. బీఆర్ఎస్ అధినేత కే.సి.ఆర్. ఆదేశాల మేరకు హరీష్ రావు ఈ కార్మికులను సురక్షితంగా భారత్‌కు తీసుకువచ్చేందుకు కృషి చేశారు. జోర్డాన్‌లో వీరు పనిచేసే కంపెనీకి చెల్లించాల్సిన పెనాల్టీతో పాటు, వారి రవాణా ఖర్చులను కూడా హరీష్ రావు స్వయంగా భరించి, బాధితులను తెలంగాణకు రప్పించారు. ఈరోజు ఉదయం విమానంలో హైదరాబాద్ చేరుకున్న బాధితులు, నేరుగా హరీష్ రావు నివాసానికి వెళ్లి ఆయనను కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ, జోర్డాన్‌లో చిక్కుకున్న తమ సమస్యను పరిష్కరించాలని కాంగ్రెస్ ప్రభుత్వానికి, అలాగే బీజేపీ ఎంపీలకు ఎన్నిసార్లు విన్నవించుకున్నా ఎవరూ పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కష్టకాలంలో తమను ఆదుకుని, తిరిగి భారత దేశానికి తీసుకువచ్చిన హరీష్ రావుకు, బీఆర్ఎస్ పార్టీకి జీవితాంతం రుణపడి ఉంటామని వారు కృతజ్ఞతలు తెలిపారు. బాధితులను స్వదేశానికి తీసుకువచ్చిన సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర



ప్రభుత్వాలకు బాధితులు అనేక సార్లు విజ్ఞప్తి చేసినా పట్టించుకోలేదన్నారు. అందుకే కేసీఆర్ ఆదేశాల మేరకు వారిని సొంత ఖర్చుతో స్వదేశానికి తీసుకువచ్చామని ఆయన వెల్లడించారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికల ముందు గల్ఫ్ కార్మికుల కోసం ప్రత్యేక గల్ఫ్ బోర్డు ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చి, ఇప్పటివరకు కనీస చర్యలు తీసుకోకపోవడంపై హరీష్ రావు మండిపడ్డారు. తెలంగాణ బీజేపీలో 8 మంది ఎంపీలు, ఇద్దరు కేంద్ర మంత్రులు ఉన్నప్పటికీ, విదేశాల్లో చిక్కుకున్న తెలంగాణ ప్రజలను కాపాడేందుకు కనీసం కృషి చేయకపోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి, విదేశాల్లో చిక్కుకున్న మన ప్రజలను సురక్షితంగా ఇంటికి చేర్చాలని హరీష్ రావు డిమాండ్ చేశారు.



## మాదకద్రవ్యాల వ్యసనాలపై అవగాహన కార్యక్రమం

**బలగం టీవీ, ఇల్లంతకుంట**

ఇల్లంతకుంట మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల లో శనివారం మాదకద్రవ్యాల వినియోగం నివారణకు సంబంధించిన 'నశా ముక్త్ భారత్ అభియాన్' లో భాగంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మిషన్ పరివర్తన మరియు జిల్లా వెల్ఫేర్ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ దేవరాజం, కమ్యూనిటీ ఎడ్యుకేటర్ జనార్ధన్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.కార్యక్రమంలో కమ్యూనిటీ ఎడ్యుకేటర్ జనార్ధన్ మాట్లాడుతూ యువతలో పెరుగుతున్న మాదకద్రవ్యాల అలవాట్లు వ్యక్తిగత, సామాజిక, కుటుంబ జీవనంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని తెలిపారు. డ్రగ్స్ వాడకం శారీరక–మానసిక ఆరోగ్యాన్ని దెబ్బతీయడంతో పాటు భవిష్యత్తును చీకట్లోకి నెడుతుందని హెచ్చరించారు.

ప్రిన్సిపాల్ దేవరాజం మాట్లాడుతూ మాదకద్రవ్యాల వాడకం ఒక్క వ్యక్తినే కాకుండా, కుటుంబాన్ని, సమాజాన్ని కూడా దెబ్బతీస్తుందని అన్నారు. యువత నశావ్యసనాలకు బానిసలు కాకుండా క్రమశిక్షణ, కృషి, ఆత్మవిశ్వాసం అనే మూడు స్తంభాలను తమ జీవితానికి ఆధారంగా చేసుకోవాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండి దేశాభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు విద్యార్థులకు మాదకద్రవ్యాల హానికర ప్రభావాలను గురించి వివరించారు. డ్రగ్ రహిత సమాజం నిర్మాణంలో ప్రతి ఒక్కరు బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు.

# వ్యవసాయ అధికారులు కొనుగోలు కేంద్రాలను సందర్శించాలి



**-క్షేత్ర స్థాయిలో ఇబ్బందులు లేకుండా చూడాలి...**

**-జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ గరీమా అగ్రవాల్**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

వ్యవసాయ విస్తరణ అధికారులు తమ పరిధిలోని కొనుగోలు కేంద్రాలను తప్పకుండా సందర్శించి, రైతులకు వచ్చే సందేహాలను నివృత్తి చేస్తూ, అన్ని అంశాలపై అవగాహన కల్పించాలని జిల్లా ఇంఛార్జి కలెక్టర్ గరీమా అగ్రవాల్ అన్నారు. శనివారం సిరిసిల్ల మున్సిపల్ పరిధి పెద్దూర్ లో మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా ఇంఛార్జి కలెక్టర్ గరీమా అగ్రవాల్ క్షేత్ర స్థాయిలో సందర్శించి, కేంద్రంలో రైతుల సౌకర్యార్థం చేపట్టిన ఏర్పాట్లను పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు

ఈ సందర్భంగా ఇంచార్జ్ కలెక్టర్ గరీమా అగ్రవాల్ మాట్లాడుతూ వర్షాల నేపథ్యంలో కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యం తడవకుండా అవసరమైన టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని, క్షేత్ర స్థాయిలో రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని అన్నారు. కేంద్రంలోని రిజిస్టర్ లను పరిశీలించి, వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని, ట్యాబ్ ఎంట్రీ లో తప్పులు దొర్లకుండా చూడాలని అన్నారు. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, అధికారులు ఎవరి బాధ్యతలు వారు సక్రమంగా నిర్వహిస్తే ధాన్యం కొనుగోళ్ళ ప్రక్రియ సజావుగా పూర్తవుతుందని అన్నారు. గ్రేడ్ – ఏ రకానికి రూ. 2,389, కామన్ రకానికి రూ. 2,369 ధర ప్రభుత్వం నిర్ణయించిందని,సన్న రకం ధాన్యం క్వింటాలుకు అదనంగా బోనస్ రూ.500 ప్రభుత్వం అందిస్తుందని అన్నారు. ఆర్డీఓ లు, తహశీల్దార్లు తప్పనిసరిగా తమ పరిధిలోని కొనుగోలు కేంద్రాలను సందర్శించి, పర్యవేక్షించాలని ఆదేశించారు. క్షేత్ర స్థాయిలో ఏమైనా ఇబ్బందులు ఎదురైతే వెంటనే జిల్లా యంత్రాంగానికి తెలియజేయాలని అన్నారు ఈ సందర్శనలో ఆర్డీఓ వెంకటేశ్వర్లు, పౌరసరఫరాలశాఖ అధికారి చంద్రప్రకాష్, తహశీల్దార్ మహేష్, మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా, మెప్మా ఏఓ మీర్జా ఫసాహత్ అలీ బేగ్, తదితరులు పాల్గొన్నారు.

## ఘన సన్మానం..

**బలగం టీవీ, బోయినపల్లి:**



మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర అధ్యక్షులు కొండ దేవయ్య పటేల్ కు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కూరగాయల మల్లేష్ తో పాటు మండల కాపు సంఘం ఆధ్వర్యంలో ఘనంగా శాలువతో సన్మానం చేశారు. తర్వాత సంఘం సభ్యత్వ నమోదు బుక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు రాములు ప్రధాన కార్యదర్శి అమ్మిశెట్టి భూమిరెడ్డి, జిల్లా సవిత కార్యదర్శి, చిందం రమేష్, రాధ, అంజయ్య, బుర్ర రాజు, నంది సత్తయ్య, మాశెట్టి జనార్ధన్, చేపు సుధాకర్, మైపాల్, రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.




# టీమిండియా సెమీస్ ప్రత్యర్థి ఆస్ట్రేలియా

- **దక్షిణాఫ్రికాపై ఆస్ట్రేలియా విజయం**

**బలగం టీవీ, హైదరాబాద్**

ప్రపంచకప్ సెమీఫైనల్ ముందు ఆత్మవిశ్వాసాన్ని పెంచుకోవాలని భావించిన దక్షిణాఫ్రికా ఆశలు చిత్తుగా మారాయి. అజేయంగా దూసుకెళ్తున్న ఆస్ట్రేలియా జట్టు చివరి లీగ్ మ్యాచ్‌లో సఫారీలను చిత్తుగా ఓడించింది. ఇండోర్‌లో జరిగిన ఈ పోరులో ఆసీస్ స్పిన్నర్ అలనా కింగ్ (7/18) కెరీర్ బెస్ట్ బౌలింగ్‌తో సంచలనం సృష్టించింది.

టాస్ గెలిచిన ఆస్ట్రేలియా బౌలింగ్ ఎంచుకొని సఫారీలపై ఒత్తిడి పెంచింది. మొదట మేగన్ షట్ కెప్టెన్ లిలిలారా వోల్వార్డ్ (31)లిలిను ఔట్ చేయగా, తరువాత అలనా కింగ్ తిప్పేసింది. ఆమె తన స్పిన్ మాంత్రికతతో లిలిసునే లుస్ (6), అనెరీ డిర్క్సెసెన్ (5), మరినే కాప్ (0), సినాలో జఫ్తా (29), ఛ్లో ట్రయాన్ (0), నడినే డీక్లెర్క్ (14), మసబత క్లాస్ (4)లిలిలను పెవిలియన్‌కి చేర్చింది. ఫలితంగా 24 ఓవర్లలోనే దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్ 97 పరుగులకు ఆలౌట్ అయింది.

తక్కువ లక్ష్యంతో బరిలోకి దిగిన ఆసీస్ ఆరంభంలో కొంత గందరగోళంలో పడింది. కేవలం 11 పరుగులకే రెండు వికెట్లు కోల్పోయింది. ఓపెనర్ లిలిఫాబే లిచ్‌ఫీల్డ్ (5)లిలిను మరినే కాప్ ఔట్ చేయగా, తదుపరి ఓవర్లో ఎలీసా పెర్రీ (0) డకౌట్ అయ్యింది. అయితే ఆ తర్వాత బేత్ మూనీ (42)–జార్జియా వోల్ (38 నాటౌట్) జంట సమీకరణాన్ని మార్చేశారు.ఇద్దరూ మూడో వికెట్‌కు 76 పరుగుల భాగస్వామ్యంతో విజయానికి పునాది వేశారు. చివర్లో అనాబెల్ సథర్‌లాండ్ (10 నాటౌట్) రెండు ఫోర్లు బాదడంతో ఆసీస్ 16.5 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించి 7 వికెట్ల తేడాతో విజయం సాధించింది.

ఈ విజయంతో ఆస్ట్రేలియా 13 పాయింట్లతో పట్టికలో అగ్రస్థానంలో నిలిచింది. దాంతో సెమీఫైనల్‌లో భారత్‌తో తలపడనుంది. మరోవైపు దక్షిణాఫ్రికా బ్యాటర్లు సమిష్టిగా విఫలమవ్వడంతో సెమీస్ ముందు గట్టి హెచ్చరిక అందుకున్నట్లయింది

## ఆస్ట్రేలియా మహిళా క్రికెటర్లపై వేధింపులు

- **నిందితుడు అరెస్టు**

**బలగం టీవీ, హైదరాబాద్**



ఐసీసీ మహిళా ప్రపంచకప్‌లో ఆడుతున్న ఇద్దరు ఆస్ట్రేలియా మహిళా క్రికెటర్లను వేధించిన ఘటన ఇండోర్‌లో సంచలనం రేపింది. బస చేస్తున్న రాడిసన్ హోటల్ నుంచి సమీప కేఫ్‌కు నడుచుకుంటూ వెళ్తున్న సమయంలో ఓ వ్యక్తి వారిని అసభ్యంగా తాకినట్లు సమాచారం. ఈ ఘటనపై ఆస్ట్రేలియా జట్టు మేనేజర్ డానీ సిమ్మన్స్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.గురువారం జరిగిన ఈ ఘటనపై మిగ్ పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టి నిందితుడిని గుర్తించారు. బైక్‌పై వెళ్లిన వ్యక్తిని స్థానికులు గుర్తించి ఇచ్చిన సమాచారం ఆధారంగా అకీల్ ఖాన్ అనే వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. శుక్రవారం నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు.

పోలీసుల ప్రకారం, ఇండోర్‌లోని ఖజరానా రోడ్డుపై ఈ ఘటన చోటుచేసుకుంది. హోటల్ నుంచి కేఫ్ దిశగా నడుస్తున్న ఇద్దరు మహిళా క్రికెటర్లను బైక్‌పై వచ్చిన అకీల్ వెంబడించాడు. వారిని అసభ్యంగా తాకి అక్కడి నుంచి పరారీ అయ్యాడని ఎస్ఐ నిధి రఘువంశీ తెలిపారు. ఘటన తర్వాత ఆస్ట్రేలియా జట్టు మేనేజర్‌తో పాటు ఏసీసీ అధికారిణి హిమాని మిశ్రా క్రికెటర్లను కలసి వారి వాంగ్మూలం తీసుకున్నారు. ఈ ఘటనపై భారతీయ న్యాయసంహితలోని సెక్షన్ 74, 78 కింద కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. బైక్ నంబర్ ఆధారంగా నిందితుడిని గుర్తించి అరెస్ట్ చేసినట్లు ఇండోర్ పోలీసులు వెల్లడించారు.

## మళ్లీ బిగ్ స్క్రీన్‌పై 'బాహుబలి'

**'బాహుబలి: ది ఎపిక్' పేరుతో అక్టోబర్ 31న రీ-రిలీజ్ .. ట్రైలర్ విడుదల**

**బలగం టీవీ, హైదరాబాద్**




దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి ప్రభాస్‌ను హీరోగా పెట్టి సృష్టించిన విజువల్ వండర్ 'బాహుబలి' మరోసారి థియేటర్లలో ప్రేక్షకులను మంత్ర ముగ్ధులను చేయడానికి సిద్ధమవుతోంది. దేశవ్యాప్తంగా సంచలన విజయాన్ని సాధించిన ఈ మహా చిత్రం ఇప్పుడు కొత్త రూపంలో మళ్లీ బిగ్ స్క్రీన్‌పైకి రాబోతోంది.

'బాహుబలి: ది ఎపిక్ అనే పేరుతో, బాహుబలి: ది బిగినింగ్ మరియు బాహుబలి 2: ది కన్‌క్లూజన్ రెండు భాగాలను ఒకే వెర్షన్‌గా మిళితం చేసి అక్టోబర్ 31న రీ–రిలీజ్ చేయనున్నారు మేకర్స్. తాజాగా ఈ వెర్షన్‌కు సంబంధించిన కొత్త ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈసారి సినిమాను సాధారణ రీ–రిలీజ్‌గా కాకుండా, మరింత సాంకేతికంగా అప్‌గ్రేడ్ చేశారు. ఐమాక్స్ , 4డీఎక్స్, డాల్బీ సినిమా వంటి అత్యాధునిక ప్రీమియం ఫార్మాట్‌ల్లో ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. రీమాస్టర్డ్ పిక్చర్, సౌండ్ క్వాలిటీతో సినిమాకు కొత్త లుక్ ఇవ్వబడింది.

ఈ సింగిల్ వెర్షన్ చిత్రం నిడివి దాదాపు 3 గంటల 44 నిమిషాలు ఉండనుంది. సెన్సార్ ప్రక్రియ పూర్తిచేసుకున్న ఈ వెర్షన్ విడుదలకు సిద్ధమైంది. సరిగ్గా పదేళ్ల తర్వాత బాహుబలి మాయాజాలాన్ని మళ్లీ పెద్ద తెరపై చూడటానికి ప్రేక్షకులు ఉత్సాహంగా ఎదురుచూస్తున్నారు. రాజమౌళి దర్శకత్వం, ప్రభాస్ శౌర్యం, అనుష్క–తమన్నా గ్లామర్, కీరవాణి సంగీతం మళ్లీ థియేటర్లలో కొత్త అనుభూతిని అందించనున్నాయి.

# రోహిత్.. కోహ్లీ.. షో

- **మూడో వన్డేలో ఆస్ట్రేలియాపై 9 వికెట్ల తేడాతో భారత్ గెలుపు**
- **రోహిత్ సెంచరీ, కోహ్లీ అజేయ అర్ధశతకం**
- **వరుస పరాజయాల తర్వాత టీమిండియాకు విజయం**

**బలగం టీవీ, హైదరాబాద్**



ఆస్ట్రేలియా పర్యటనలో వరుస పరాజయాలతో ఇబ్బంది పడిన టీమిండియా ఎట్టకేలకు విజయ రుచిని ఆస్వాదించింది. మూడు వన్డేల సిరీస్‌లో తొలి రెండు మ్యాచ్‌లను కోల్పోయిన భారత్, చివరి వన్డేలో ఘన విజయం సాధించింది. 9 వికెట్ల తేడాతో ఆసీస్‌పై గెలిచిన భారత్ సిరీస్‌ను 2–1 తేడాతో ముగించింది.

**రోహిత్ సెంచరీ, కోహ్లీ అజేయ అర్ధశతకం**

సీనియర్ ఆటగాళ్లు రోహిత్ శర్మ (125 బంతుల్లో 121 నాటౌట్, 13 ఫోర్లు, 3 సిక్స్‌లు) మరియు విరాట్ కోహ్లీ (81 బంతుల్లో 74 నాటౌట్) అద్భుతంగా రాణించారు. ఇద్దరి జంట ఇన్నింగ్స్ భారత్ విజయానికి పునాది వేసింది. రోహిత్ అజేయ సెంచరీతో మెరుస్తూ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డును కైవసం చేసుకున్నాడు.

ముందుగా బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా జట్టు 46.4 ఓవర్లలో 236 పరుగులకే ఆలౌట్ అయింది. మ్యాట్ రేన్‌షా (56), మిచెల్ మార్ష్ (41), మాథ్యూ షార్ట్ (30) కొంత ప్రతిఘటన కనబరిచారు. భారత బౌలర్లలో హర్షిత్ రాణా (4/39) చెలరేగగా, వాషింగ్టన్ సుందర్ (2/44) రెండు వికెట్లు తీశాడు. సిరాజ్, ప్రసిధ్, కుల్దీప్, అక్షర్ తలో వికెట్ దక్కించుకున్నారు.

**విజయ లక్ష్యచేధనలో ఆత్మవిశ్వాసం**

237 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్ ధీమాగా ఆడింది. ఓపెనర్ శుభ్‌మన్ గిల్ (24) త్వరగానే ఔటైనప్పటికీ, ఆ తర్వాత రోహిత్–కోహ్లీ జంట స్థిరంగా ఆడారు. మొదటి వికెట్‌కు 69 పరుగుల భాగస్వామ్యంతో ఆరంభమిచ్చి, తర్వాత ఈ జంట 168 పరుగుల భారీ భాగస్వామ్యంతో మ్యాచ్‌ను భారత్ వైపు తిప్పేసింది. భారత్ కేవలం 38.3 ఓవర్లలో వికెట్ నష్టానికి 232 పరుగులు చేసి 69 బంతులు మిగిలుండగానే లక్ష్యాన్ని అందుకుంది.

**టీ20 సిరీస్ బుధవారం ప్రారంభం**

బుధవారం నుంచి భారత్–ఆస్ట్రేలియా మధ్య ఐదు టీ20ల సిరీస్ ప్రారంభం కానుంది.




## ది గర్ల్‌ఫ్రెండ్ తో రష్మిక కొత్త ప్రయాణం

- **ట్రైలర్ విడుదల**
- **నవంబర్ 7న ప్రేక్షకుల ముందుకు 'నేషనల్ క్రష్' తాజా చిత్రం**

**బలగం టీవీ, హైదరాబాద్**

యానిమల్, పుష్ప 2: ది రూల్, ఛావా, థామా వంటి వరుస బ్లాక్‌బస్టర్లతో విజయపథంలో దూసుకెళ్తున్న నేషనల్ క్రష్ రష్మిక మందన్నా ఇప్పుడు లేడీ ఓరియెంటెడ్ కథతో ప్రేక్షకుల ముందుకు రానుంది. రష్మిక ప్రధాన పాత్రలో తెరకెక్కిన తాజా చిత్రం 'ది గర్ల్‌ఫ్రెండ్'. ఈ సినిమాకు దర్శకుడిగా నటుడు%–%దర్శకుడు రాహుల్ రవీంద్రన్ వ్యవహరిస్తున్నారు.

ఇప్పటికే షూటింగ్ పూర్తిచేసుకున్న ఈ చిత్రం నవంబర్ 7న విడుదల కానుంది. ఈ సందర్భంగా చిత్ర బృందం తాజాగా ట్రైలర్‌ను విడుదల చేసింది. "మనం చిన్న బ్రేక్ తీసుకుందామా..?" అంటూ మొదలైన ఈ ట్రైలర్ భావోద్వేగాలతో నిండిపోయి, ప్రేమలోని నాజూకు క్షణాలను చూపించింది. రష్మికకు బాయ్‌ఫ్రెండ్‌గా యువ నటుడు దీక్షిత్ శెట్టి నటిస్తున్నాడు. ఈ సినిమాను ప్రముఖ నిర్మాణ సంస్థ గీతా ఆర్ట్స్ బ్యానర్‌పై అల్లు అరవింద్ సమర్పిస్తున్నారు. రష్మిక కెరీర్‌లో కొత్త దిశగా పరిగణించబడుతున్న ఈ చిత్రం మహిళా ప్రేక్షకుల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని సినీ వర్గాలు అంచనా వేస్తున్నాయి.





## రేపు మాస్ జాతర ట్రైలర్

**బలగం టీవీ, హైదరాబాద్**

టాలీవుడ్ స్టార్ హీరో రవితేజ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'మాస్ జాతర' విడుదలకు సిద్ధమైంది. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న ఈ సినిమాకు భాను భోగవరపు దర్శకత్వం వహిస్తున్నారు. రవితేజ సరసన శ్రీలీల కథానాయికగా నటిస్తోంది. తాజాగా చిత్రబృందం ట్రైలర్ రిలీజ్ అప్‌డేట్‌ను ప్రకటించింది. 'మాస్ జాతర' ట్రైలర్ అక్టోబర్ 27న (సోమవారం) విడుదల కానుంది. మాస్ మహారాజ్ అభిమానుల్లో ఈ అప్‌డేట్ సంబరాలు రేపుతోంది. ఈ సినిమాలో రవితేజ రైల్వే పోలీస్ ఆఫీసర్ పాత్రలో కనిపించనున్నాడు. యాక్షన్, ఎమోషన్, ఎంటర్‌టైన్‌మెంట్‌ల మేళవింపుతో తెరకెక్కుతున్న ఈ చిత్రం అక్టోబర్ 31న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.

## బాలీవుడ్ నటుడు సతీష్ షా కన్నుమూత

**బలగం టీవీ, హైదరాబాద్**



బాలీవుడ్ ప్రముఖ నటుడు సతీష్ రవీలాల్ షా ఇకలేరు. కిడ్నీ సంబంధిత అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన శనివారం మధ్యాహ్నం ముంబైలోని బాంద్రా ఈస్ట్‌లోని తన నివాసంలో తుదిశ్వాస విడిచారు. ఆయన వయస్సు 74 సంవత్సరాలు. ఈ వార్త తెలిసిన సినీ ప్రపంచం శోకసంద్రంలో మునిగిపోయింది.

1951 జూన్ 25న జన్మించిన సతీష్ షా, భారతీయ సినిమా%–%టెలివిజన్ రంగాలలో బహుముఖ ప్రతిభ కనబరిచారు. జానే బీ దో యారో, మై హూ నా, సారాభాయ్ వర్సెస్ సారాభాయ్, మాలామాల్, హీరా ఫేరి, కల్ హెూ నా హెూ వంటి అనేక చిత్రాలలో ఆయన నటన ప్రేక్షకులను అలరించింది. ప్రత్యేకమైన టైమింగ్, సహజమైన హాస్యంతో ఆయనకు ప్రేక్షకుల్లో విపరీతమైన అభిమానాన్ని సంపాదించారు.

జానే బీ దో యారో చిత్రంలో లంచగొండి మున్సిపల్ కమిషనర్‌గా నటించిన పాత్ర ఆయన కెరీర్‌లో మైలురాయి అయింది. ఈ చిత్రంలో నసీరుద్దిన్ షా, ఓం పురి, పంకజ్ కపూర్ వంటి ప్రముఖులతో కలిసి ఆయన నటనకు విశేష ప్రశంసలు దక్కాయి.పూణేలోని ఫిల్మ్ అండ్ టెలివిజన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా నుంచి గ్రాడ్యుయేట్ అయిన సతీష్ షా, రంగస్థల నటుడిగానూ గుర్తింపు పొందారు. సినిమాల్లో నటించకముందు ఆయన అనేక నాటకాలలో ప్రదర్శనలు ఇచ్చారు. డిజైనర్ మధు షా ఆయన జీవిత భాగస్వామి. వీరికి ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. ఆయన మృతిపట్ల అనేక సినీ ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు.